గుండెపోటుతో ఉద్యమకారుడు మృతి

- **అంత్యక్రియల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు**

వర్ని (రుద్రూర్), మార్చి 5 : వర్ని మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్త, ఉద్యమనాయకుడు కృష్ణాగౌడ్ (35) గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్, బీఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ ఎజాజ్ పాల్గొని పాడె మోశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఆనంద్, శివ, సూరి, రమేశ్, సంజయ్ పాల్గొన్నారు.

బురదలో పడి వ్యక్తి మృతి

రుద్రూర్, మార్చి 5 : మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన బొర్ర చిన్నసాయిలు (45) ప్రమాదవశాత్తు బురదలో పడి మృతి చెందాడు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. బొప్పాపూర్ గ్రామానికి చెందిన సాయిలు చేపలు పట్టేందుకు బొప్పాపూర్ శివారులోని గూండ్ల వాగు వద్దకు మంగళవారం రాత్రి 11 గంటలకు వెళ్లాడు. వల వేసి తిరిగివస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బురదలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తికి 15 రోజుల కస్టడీ

వినాయక్‌నగర్, మార్చి 5 : నగరంలోని గాజులపేట్‌లో మద్యం మత్తులో లింగంపల్లి మహేశ్‌పై మంగళవారం కత్తితో దాడిచేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు రెండో టౌన్ ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపారు. బాధితుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోడిగం సంతోష్‌పై కేసు నమోదు చేసి, బుధవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్సై తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఇందల్వాయి, మార్చి 5 : ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన ముప్వాజి రాకేశ్ (23) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ముప్వాజి రాకేశ్ పొలంలో పచ్చిగడ్డి కోసుకు వచ్చేందుకు వెళ్లి పొలంలో పడి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

ఇందల్వాయి, మార్చి 5 : మండలకేంద్రంలో వీధికుక్కలు నలుగురిపై బుధవారం దాడి చేసి గాయపర్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం ముగ్గురు మహిళలతోసహా పురుషుడు, పశువులపై సైతం దాడి చేశాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలించారు. వీధికుక్కలతో పాటు కోతులు సైతం దాడి చేస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, అధికారులు స్పందించి కుక్కలు, కోతుల బెడద అరికట్టేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

616 కిలోల గంజాయి దహనం

జక్రాన్‌పల్లి, మార్చి 5 : జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుబడిన నిషేధిత మత్తు పదార్థాలను పోలీసులు బుధవారం దహనం చేశారు. మండలంలోని పడకల్ శివారులో ఉన్న శ్రీ మెడికేర్ సర్వీసెస్‌లో దహనం చేసినట్లు డ్రగ్స్ డిస్పోజబుల్ కమిటీ సభ్యుడు, అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఆదేశాల మేరకు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 23 పాత కేసుల్లో పట్టుబడిన 616 కిలోల 837 గ్రాముల గంజాయి, 3 కిలోల 444 గ్రాముల అల్ప్రాజోలం దహనం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ రవీందర్‌రెడ్డి, ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మార్చి 5 : జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. తాగునీటి సరఫరా, ఆస్తి పన్ను వసూలు, ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) రుసుము వసూలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు మార్కవుట్ చేయడం, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో కంప్లయింట్ బాక్సుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఆస్తి పన్ను, ప్లాట్ల క్రమబద్ధీకరణ రుసుము వసూళ్లలో వేగం పెంచాలని ఆదేశించారు. పన్ను వసూళ్లలో పూర్తిగా వెనుకంజలో ఉన్న గ్రామపంచాయతీల కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డీఎల్పీవోలకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టేలా మార్కవుట్ ప్రక్రియను త్వరగా చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, జడ్పీ సీఈవో సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేంద్రకుమార్, ఈఈలు రాకేశ్, స్వప్న, మున్సిపల్ కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీయూలో బయోటెక్నాలజీ ప్రయోగాల వర్క్‌షాప్

వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

డిచ్‌పల్లి, మార్చి 5 : టీయూలో బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బయోటెక్నాలజీ ప్రయోగాల ప్రదర్శనపై కార్యశాల విభాగాధిపతి, కార్యశాల కన్వీనర్ డాక్టర్ ప్రసన్నశీల అధ్యక్షతన బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య యాదగిరిరావు హాజరై మాట్లాడారు. వ్యవసాయ రంగంలో నూతన వంగడాల సృష్టి, పారిశ్రామిక రంగంలో అధిక ఉత్పత్తి, వైద్యరంగంలో అనేక వ్యాధుల నివారణకు ఈ శాస్త్రం కృషి చేస్తుందన్నారు. కోవిడ్ లాంటి ప్రాణాంతక వైరస్‌ను నశింపజేసేందుకు భారత్ బయోటెక్నాలజీ సంస్థ వ్యాక్సిన్ తయారుచేసి కోవిడ్ నుంచి ప్రాణాలు కాపాడిందని గుర్తు చేశారు.

21 నుంచి 25 వరకు అంతర్జాతీయ కార్యశాల

డిచ్‌పల్లి, మార్చి 5 : టీయూలో హార్వార్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లతో ఈనెల 21 నుంచి 25 వరకు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు కన్వీనర్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల తెలిపారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి బుధవారం బ్రోచర్లు ఆవిష్కరించారు. యునైటెడ్ వే -హైదరాబాద్ సౌజన్యంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగాం, సెల్ఫ్‌కేర్ అంశాలపై కార్యశాల ఉంటుందని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చందూర్, మార్చి 5 : మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్‌ను బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ మాధవరెడ్డి, మాముళ్ల శ్రీనివాస్, బర్ల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ మొదటి వారం నుంచి బాల్‌భవన్‌లో శిక్షణ

సుభాష్‌నగర్, మార్చి 5 : జిల్లాకేంద్రంలోని బాల్‌భవన్‌లో ఏప్రిల్ మొదటివారం నుంచి జూన్ రెండోవారం వరకు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు నూతన పర్యవేక్షకురాలు, సీనియర్ సంగీత శిక్షకురాలు మల్లాది ఉమాబాల తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బాల్‌భవన్‌లో 6-16 ఏండ్ల వయస్సు ఉన్న బాలబాలికలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంగీతం, నృత్యం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, తబలా తదితర 30 విభాగాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. బాలబాలికలు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్మీ జవాన్‌కు పురస్కారం

పురస్కారాన్ని చూపుతున్న జీఎం నగేశ్

ఇందల్వాయి, మార్చి 5 : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ జీఎం నగేశ్.. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అంత్రిక సురక్షా సేవా పురస్కారాన్ని ఈనెల 3న అందుకున్నారు. దేశం కోసం చేస్తున్న సేవలను గుర్తించి పురస్కారం అందజేసినట్లు ఆర్మీ జవాన్ పేర్కొన్నారు. ఆయన పురస్కారం అందుకోవడంపై ఎల్లారెడ్డి పల్లి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 'రైతుబీమా' కరువు

- **రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి**
- **ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి పరామర్శ**

ఇందల్వాయి/ డిచ్‌పల్లి/ సారంగపూర్, మార్చి 5 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు కుటుంబాలకు రైతుబీమా అందడం లేదని, ప్రీమియం కట్టకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూపాయి కూడా రావడం లేదని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఇందల్వాయి తండాకు చెందిన రైతు వసంతనాయక్ అప్పుల బాధ భరించలేక ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబాన్ని బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం పరామర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 3 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షలు రైతుబీమా వర్తింపజేస్తే రూ. 150 కోట్లు రైతులకు వచ్చేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాధిత రైతు కుటుంబాలకు రోజుల వ్యవధిలోనే రూ. 5 లక్షలు అందజేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటాయని, విద్యుత్ సరఫరా సరిగ్గా లేక పొలాలు ఎండిపోతున్నాయన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాధవనగర్ సాయిబాబా ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొత్త సత్యనారాయణ గుప్తా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. డిచ్‌పల్లిలోని బాధిత కుటుంబాన్ని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ బుధవారం పరామర్శించారు. సత్యనారాయణ గుప్తా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రూరల్ మండలంలోని రాంనగర్‌కు చెందిన సూర్యపాక స్వామిబ్రెయిన్‌స్ట్రోక్‌తో, మల్కాపూర్(ఏ)కు చెందిన బాలరాజు అనారోగ్యంతో దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. వారిని బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించాలి

- **అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్**
- **మత్తు పదార్థాల నిరోధానికి కృషిచేయాలి**

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

కంఠేశ్వర్, మార్చి 5 : వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈసారి సాధారణం కన్నా ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల నిరోధానికి అధికారులు కలిసికట్టుగా కృషిచేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించి మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి, వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. గంజాయి, అల్ప్రాజోలం నిల్వలపై ఆరా తీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రంథాలయాల పరిశీలన

బోధన్ / మోస్రా (చందూర్)/ రుద్రూర్, మార్చి 5 : బోధన్, మోస్రా, రుద్రూర్‌లోని గ్రంథాలయాలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి బుధవారం పరిశీలించారు. బోధన్ పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సందీప్, పాఠకులు, విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయంలో అన్ని దినపత్రికలతో పాటు వార పత్రికలను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం రుద్రూర్‌లోని గ్రంథాలయాలను పరిశీలించారు. రాయకూర్ క్యాంపులో గ్రంథాలయ నిర్వహణ సరిగాలేదని, గ్రంథాలయం తెరిచిన ఆనవాళ్లు కనబడడం లేదని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షిప్తంగా..

- **ఏటీఎంలోకి వెళ్లి వచ్చేలోగా బైక్ చోరీ** - వినాయక్‌నగర్, మార్చి 5 : నిజామాబాద్ నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో ఉన్న ఏటీఎం సెంటల్‌లోకి వెళ్లి వచ్చేలోగా బైక్ చోరీకి గురైంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ముస్తాయిపురకు చెందిన షేక్ అహ్మద్ నగరంలోని బస్టాండ్ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం ఎదుట తన పల్సర్‌బైక్ పార్క్ చేసి, ఏటీఎం లోనికి వెళ్లి, బయటికి వచ్చే సరికి బైక్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.
- **బైకును ఢీకొట్టిన కారు : ఇద్దరికి గాయాలు** - వినాయక్‌నగర్, మార్చి 5 : నగరంలోని సుభాష్‌నగర్‌లో బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరు మైనర్లకు గాయాలయ్యాయి. త్రీటౌన్ ఎస్సై హరిబాబు కథనం ప్రకారం.. బుధవారం ఉదయం అబ్రార్, రియాన్ ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాలను చూసుకునేందుకు బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరి కాలు విరగగా.. మరొకరికి గాయాలయ్యాయి. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.
- **తాగునీటి సమస్య లేకుండా చూడాలి**- కోటగిరి, మార్చి 5 : తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోటగిరి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కోటగిరి మండల పరిషత్ సమావేశపు హాలులో కార్యదర్శులు, కారోబార్లు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. భగీరథ నీరు సరఫరా కాని రోజు స్థానికంగా ఉన్న బోరు మోటర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో చందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధన్‌రాజ్, కార్యదర్శులు పాల్గొన్నారు.
- **ఆర్థిక సాయం అందజేత** - ఇందల్వాయి, మార్చి 5 : మండలంలోని లోలం గ్రామంలో పశువులు కాసేందుకు వచ్చిన ఓ కుటుంబానికి గ్రామస్తులు బుధవారం రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సౌకర్యార్థం సేవా దృక్పథంతో గ్రామస్తులందరూ కలిసి ఆర్థిక సాయం అందజేసినట్లు గ్రామపెద్దలు తెలిపారు.
- **ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాట్లు** - పొతంగల్, మార్చి 5 : మండల కేంద్రంలో బుధవారం 100 కేవీఏ, హంగర్గాఫా రంలో 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం ఏర్పాటు చేసినట్లు మండల విద్యుత్ ఇన్‌చార్జి ఏఈ ఫక్రుద్దీన్ ఖాద్రీ తెలిపారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
- **వృత్తివిద్యపై అవగాహన** - సిరికొండ, మార్చి 5 : మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఎంఈవో రాములు ఆదేశాల మేరకు తూంపల్లి, కొండాపూర్ విద్యార్థులకు వృత్తివిద్యపై ఉపాధ్యాయులు ప్రయోగశాలలో ప్రత్యక్షంగా బుధవారం అవగాహన కల్పించారు. గణిత, భౌతిక, రసాయనశాస్త్రం, భౌతిక శాస్త్రం, కంప్యూటర్, వ్యవసాయ విద్యపై అవగాహన కల్పించి, ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **మీసేవ కేంద్రం తనిఖీ** - ఇందల్వాయి, మార్చి 5 : మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ఉన్న మీసేవ కేంద్రాన్ని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్ బుధవారం తనిఖీ చేశారు. అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. అధిక రుసుము వసూలు చేస్తే మీసేవకేంద్రాన్ని తొలగిస్తామని హెచ్చరించారు.
- **యోగాపై అవగాహన** - డిచ్‌పల్లి, మార్చి 5 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని టీయూలో ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ భ్రమరాంబిక ఆధ్వర్యంలో ఆరోగ్య రక్ష నేచర్ క్యూరో యోగా సెంటర్ థెరపిస్ట్ ఐశ్వర్య యోగాపై బుధవారం అవగాహన కల్పించారు. అధ్యాపకులు, విద్యార్థినులకు యోగాసనాలపై అవగాహన కల్పించి, ఆసనాలు వేయించారు.
- **పాఠశాల వార్షికోత్సవం** - పొతంగల్, మార్చి 5 : మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో శంకర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సబ్జెక్టును ఇష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం పదోతరగతి విద్యార్థులకు పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి మొదటి బహుమతిగా రూ. 5 వేలు, రెండో బహుమతిగా రూ. 3 వేలు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అందజేస్తానని మండల నాయకుడు ప్రకాశ్ పటేల్ తెలిపారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ

మోర్తాడ్, మార్చి 5: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌బీ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... సమాజంలో బాలికల ప్రాముఖ్యత, విలువలు, సోషల్‌మీడియా ప్రభావం, బాలికలు ఉన్నతస్థానానికి వెళ్లేందుకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరించారు. బాల్యవివాహాలు చేసుకోవడంతో జరిగే దుష్పరిమాణాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, పోక్సోచట్టం, బాలికల హక్కులు, చట్టాలను వివరించారు. అనంతరం బాలికలకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో స్వర్ణలత, ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ గంగహంస, సౌమ్య, చైతన్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Bheemgal Branch, Dist. Nizamabad agreed to accord Loan to **Borrower: Bukya Ganesh** S/o Bhukya Harilal, Age 33 Yrs, Occ: Business, R/o H.No.14-81, Sudharshan Nagar Thanda (V) Bheemgal (M), Nizamabad (Dist) on mortgage of the schedule referred plot property of **Bhukya Yamuna**. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be "Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.Hence this notice

SCHEDULE PROPERTY

The RCC Roofed House bearing G.P.No.(13-64/A/95/1 Old), 13-65/13/1/2 (New) property situated at Bheemgal Village and Mandal, Nizamabad District, Grampanchayath: Bheemgal, Mandal Parishad Bheemgal, Dist and Zilla Parishad Nizamabad, within the limits of Municipality Bheemgal, under the registration Sub Dist Bheemgal, Regn.Dist Nizamabad Admeasuring total site area 2507.00 Sq.Fts or 278.55 Sq. Yds or 233.00 Sq.MtrsRCC Roof Built up area 623.43 Sq.fts **(As per approved plan)**

Bounded as below : North:G.P.Road, South:Dismantle House of others, East: G.P. Road, West:G.P.Road.

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

శక్కర్‌నగర్, మార్చి 5: బోధన్ పట్టణ శివారులోని అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. ఆయన బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2020 వరకు లేఔట్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 31లోగా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. 31వ తేదీ లోపు క్రమబద్ధీకరించుకుంటే 25 శాతం ఫీజు రాయితీ ఉంటుందని వెల్లడించారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి సందేహాలుంటే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'హెల్ప్‌డెస్క్' లో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ ఒక ప్రకటనలో సూచించారు. లేదా 6301707191 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

10న పీఎం అప్రెంటీస్ షిప్ మేళా

ఖలీల్‌వాడి, మార్చి 5 : జిల్లాకేంద్రంలోని బాలుర ఐటీఐలో ఈనెల 10న పీఎం అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కన్వీనర్, ప్రిన్సిపాల్ యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఐటీఐలో వివిధ కోర్సులు పూర్తి చేసి, 18 సంవత్సరాలు నిండిన అర్హులని తెలిపారు. మేళాకు హాజరుకావాలనుకునే వారు https://www/apprentieeshipindia.gov.in/ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఒక సెట్ జిరాక్స్‌తో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441074767 నంబర్‌కు ఫోన్‌చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

మోర్తాడ్/ముప్కాల్, మార్చి5: కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య బుధవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... లబ్ధిదారులు త్వరగా పనులు ప్రారంభించాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి, రంజిత్, రాజేశ్వర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత

ఆర్మూర్‌టౌన్, మార్చి5: ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా ఎనిమిది సెల్‌ఫోన్లను రికవరీ చేసి పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్‌హెచ్‌వో బాధితులకు అప్పగించారు. ఎవరైనా సెల్‌ఫోను పోగొట్టుకుంటే వివరాలను అందజేయాలన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. యువకుడి మృతి

ఎడపల్లి, మార్చి 5: గర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు బుధవారం మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఠానాకలాన్ గ్రామానికి చెందిన మెట్టు శ్రీనివాస్ (26) సొంత పని మీద జానకంపేట్‌కు బైక్‌పై వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి వస్తుండగా జానకంపేట్ శివారులోని పోలీసు శిక్షణ కేంద్రం ఎదుట గర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఎడపల్లి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.